క్లుప్తంగా

ఇంద్రపాలెంలో సామాజిక సమతా సంకల్పం



ఇంద్రపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను తదితరులు

కాకినాడ రూరల్: విజయవాడలో భారీ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటును పురస్కరించుకుని గ్రామాల్లో సామాజిక సమతా సంకల్పం నిర్వహిస్తున్నారు. మండలంలోని ఇంద్రపాలెంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించి ఆయన మార్గంలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సంతకాలు సేకరణలో పాల్గొని సంతకాలు చేశారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్, పలివెల శ్రీనివాస్, మాధవ, రామ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఐదు దీపాలు వెలిగించాలి



అయోధ్యరాముని పూజాక్షతలు పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

బోట్‌క్లబ్: ఈనెల 22వ తేదీన అయోధ్య రామ మందిరంలో సాగే విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రతి ఒక్కరు తమ ఇంటిల్లో 5 దీపాలను వెలిగించాలని విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యుడు రవిశంకర్ పట్నాయక్ కోరారు. కాకినాడ జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన పూజాక్షతలను గురువారం ఇంటింటా పంపిణీ చేశారు. ఈనెల 22వ తేదీన అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజాక్షతలను తలపై వేసుకుని ఇంట్లో 5 దీపాలను వెలిగించాలన్నారు. పరిషత్ సభ్యులు గరిమెళ్ళ అన్నపూర్ణయ్యశర్మ, ఉదయ భానోజీ రావు, బచ్చు మహాలక్ష్మి, మాలతీదేవి, రవి వర్మ, కళీదాసు, వివిధ క్షేత్రాల ధార్మిక సంస్థల సభ్యులు ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామ మందిరం పూక్షతలు పంపిణీ చేశారు.

యువతతోనే దేశాభివృద్ధి



నృత్యం చేస్తున్న విద్యార్థిని

బాలాజీచెరువు: దేశాభివృద్ధి యువత ద్వారా సాధ్యమౌతుందని, యువత తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి పేర్కొన్నారు. విద్యుత్ నగర్ ఐడియల్ డిగ్రీ కళాశాలలో యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని, సమాజ సేవా దృష్టిని కలిగించడానికి యువజోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

కాకినాడ సిటీ: గత 22 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారు సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.చంటిబాబు గురువారం సాయంత్రం తెలిపారు. హెచ్ఆర్ పాలసీ అమలుకు మంత్రుల కమిటీని నియమిస్తున్నట్లు, మినిమం టైం స్కేల్ సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన అమలును పరిశీలిస్తున్నామని, 2017 నుంచి వేతనాలు పెరగని 7 వేల మందికి 23 శాతం వేతనాలు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. పీఎఫ్ అమలు చేస్తామని, పీటీఏలను ఒకేషనల్ టీచర్లుగా, సీఆర్ఎంటీ, ఐఈఆర్పీ, సైట్ ఇంజినీర్లకు డిజిగ్నేషన్ మార్చేందుకు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు, మండల అకౌంటెంట్లకు ఈక్వలెంట్ కేడర్ మారుస్తామని అంగీకరించినట్లు తెలిపారు. తొలగించిన 130 మందిని విధుల్లోకి తీసుకుంటామని, సమ్మె చేసిన రోజులకు వేతనాలు చెల్లిస్తామని, పెండింగ్‌లో ఉన్న నవంబర్, డిసెంబర్ వేతనాలు తక్షణం విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అంగీకరించారని వివరించారు.

అంగన్‌వాడీలపై ఎస్మా రద్దు చేయండి

కాకినాడ సిటీ: సమస్యలను పరిష్కరించాలని పోరాడుతున్న అంగన్‌వాడీలపై పెట్టిన ఎస్మాను ఉపసంహరించి సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సీపీఎం కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్యభవన్‌లో సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కె.బోడకొండ, జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



భోగి మంట వెలిగిస్తున్న పాఠశాల డైరెక్టర్ విజయ ప్రకాష్, సతీమణి సమీర



జి.భావారంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గణేష్



కరపలో రంగవల్లులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- పలు పోటీల్లో సందడి చేసిన మహిళలు
- విజేతలకు బహుమతి ప్రదానం



కరపలో బహుమతులు పొందిన విజేతలతో సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంఈఓలు

కరప: నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో మహిళలను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు మండలంలో జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద గురువారం రంగవల్లులు, మ్యూజికల్ చైర్, స్పూన్ అండ్ లెమన్ పోటీలను నిర్వహించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి ఆధ్వర్యంలో టీచర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి, ఒక్కో ఈవెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపికచేశారు. ఎమ్మెల్యే కన్నబాబు సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన మిక్సీ, నాన్‌స్టిక్ పాన్, హాట్‌బ్యాక్సులను విజేతలకు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, సాదే లోహిదాస్, కేశవరావు అందజేశారు. పోటీలలో పాల్గొన్న 119 మందికి ప్రోత్సాహక బహుమతిగా ప్లాస్టిక్ బుట్టలను అందజేశారు. చివరి రోజున కరప, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, జి.భావారం, యండమూరు గ్రామాల్లో జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట రంగవల్లులు, మ్యూజికల్ చైర్, స్పూన్ అండ్ లెమన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్‌లు రొక్కాల గణేష్, కె.రమాదేవి, వెలుగుబంటి సీతారామరాఘవ, మార్శెట్ల శివ, నక్కా బాబులు, బిరుదా శ్రీనివాస అప్పారావు, కార్యదర్శులు పి.ఉమామహేశ్వరి, పి.వీరభద్రరావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు

బాలాజీచెరువు: శ్రీ ప్రకాష్ పాఠశాలలో గురువారం సంక్రాంతి శోభ సంతరించుకుంది. విద్యార్థులచే సంప్రదాయ వస్త్రధారణలో సంక్రాంతికి స్వాగతం చెబుతూ రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలను అలంకరించారు. పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్, సతీమణి సమీర ముగ్గుల మధ్య గొబ్బెమ్మలకు శాస్త్రయుక్తంగా పూజలు చేశారు. అనంతరం భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు సంక్రాంతి విశిష్టత, సంస్కృతి సాంప్రదాయాలు పెద్దగా తెలియవని, గాలిపటాలు, ముగ్గుల పోటీల వంటివి ఏర్పాటు చేసి వారికి పల్లె వాతావరణం తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

కరప: సంక్రాంతి పేరుతో కోడి పందేలు నిర్వహించినా, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ టి.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. మామిడితోటలనుకానీ, దిబ్బలను కానీ కోడిపందాలు నిర్వహణకు ఎవరికీ ఇవ్వరాదన్నారు. పోలీసు రికార్డులను అనుసరించి పదేళ్లకాలంలో కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించిన పాతనేరస్తులను ఇప్పటికే బైండోవర్ చేసి, తహసీల్దార్ కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు. ఎక్కడైనా పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారమిచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్, సిబ్బంది మునాఫ్, సురేష్, లోవరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ స్కిల్ కళాశాలలో 16మంది ఉద్యోగాలకు ఎంపిక

బాలాజీచెరువు: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ పథకం ద్వారా జేఎన్‌టీయూకేలో నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలలో 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ 55 మంది శిక్షణ పొందగా 44 మంది జీబీఎం కోరమండల్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ట్రైనింగ్‌లో నెలకూ రూ.19 వేలు, అనంతరం నెలకు రూ.24 వేలు వేతనం ఉంటుందన్నారు.

తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదు

- నీడను కూడా నమ్మని చంద్రబాబుకు లోకేష్, బాలయ్య నుంచే పదవీ గండం
- రెడ్డి సామాజికవర్గంపై అక్కసు తగదు
- చంద్రబాబుపై ఎమ్మెల్యే ద్వారంపూడి ధ్వజం



కాకినాడ: దొంగహామీలు, అబద్దాలు, మోసాలతో ఆరితేరిన చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టేందుకు తనపై తప్పుడు విమర్శలు చేస్తే ఏ మాత్రం సహించేది లేదని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. తుని పర్యటనలో తనపై చేసిన విమర్శలపై ద్వారంపూడి మండిపడ్డారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం కోసం జిల్లాకు వచ్చిన చంద్రబాబు తమ పార్టీ విధి విధానాలు, ప్రణాళికలను చెప్పాల్సింది పోయి అధికార పార్టీ ఎమ్మెల్యేలపై బురదజల్లడం సమంజసం కాదని హితవు పలికారు. లేనిపోని అవినీతి ఆరోపణలు చేస్తోన్న చంద్రబాబు... ఆయన హయాంలో సాగిన అవినీతి అక్రమాల గురించి మాట్లాడాల్సి వస్తే గంటల సమయం పడుతోందన్నారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న ఆయనకు ఇక్కడ బియ్యం అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందోలేదో తెలియదా? అని నిలదీశారు. ప్రతిసారి తనపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, ఆయనలా తాను కూడా దూకుడుగా మాట్లాడాల్సి వస్తే తండ్రీకొడుకులిద్దరూ బయటకు రాలేక ఇంటికే పరిమితం కావాల్సి వస్తోందని, అయితే సంస్కారం అడ్డువచ్చి మర్యాదగా మాట్లాడుతున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోని రెడ్డి సామాజికవర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. సమర్థతను చూసి వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి వంటి నేతలకు పార్టీ పర్యవేక్షణ బాధ్యతలను సీఎం అప్పగించారన్నారు. ఆంధ్రా, తెలంగాణ, చివరకు తెలుగుదేశం పార్టీలో కూడా ఎక్కువ మంది రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నీడను కూడా నమ్మని చంద్రబాబుకు ఇన్‌చార్జిలు కూడా కరువయ్యారని, ఆయన తరువాత రెండో స్థానంలో నిలిచే నాయకుడు కూడా లేకపోయారన్నారు. చంద్రబాబు మరో పది పదిహేను రోజులు జైలులో ఉంటే లోకేష్, బాలయ్య కలిసి ఆయనను పదవి నుంచి దించేసేవారని ద్వారంపూడి వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నీడను కూడా నమ్మలేక అభద్రతా భావంతో ఉన్నారని, ఆయనకు కూడా ఏదో ఒక రోజు వియ్యంకుడు, కొడుకు రూపంలో పదవీగండం పొంచి ఉందన్నారు.

పథకాలకు అర్హతే ప్రాతిపదిక

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 23వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 23వ డివిజన్‌లోని ఎంకే మావుళ్లయ్య కమ్యూనిటీ హాలు ఆవరణలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌కు సంబంధించిన ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శన ఫలకాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ మీసాల శ్రీదేవి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఒక్క కాకినాడ సిటీ పరిధిలో 30 వేల మందికి పైగా ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం కూడా వేగవంతం చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. డివిజన్ పరిధిలో గడచిన నాలుగున్నరేళ్లలో రూ.48 కోట్ల ఖర్చు కాగల సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు అందించామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు, పవన్‌బాబు, కొండబాబు వంటి వ్యక్తులు ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని, వీరి మాయమాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అభివృద్ధిని కాంక్షించే సీఎంను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ సోమదుల గోవిందు, స్థానిక రెల్లిపేట, కేశవారివీధి, మహాలక్ష్మి నగర్ ప్రాంతాల పెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో..

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ సచివాలయం-1 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని అధికారులు గురువారం సాయంత్రం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నోడల్ అధికారి, ఈవో పీఆర్డీ రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఈవో పీఆర్డీ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు పంపిణీ చేశామని, డీబీటీ, నాన్‌డీబీటీ కింద రూ.28.76 కోట్లు లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిందన్నారు. జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంతో మా నమ్మకం నువ్వే జగనన్న అని ప్రజలు చెబుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు.

ప్రభుత్వ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలి

కలెక్టర్ కృతికా శుక్లా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాశ్వత భవనాల పనులు వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం అమరావతి నుంచి కలెక్టర్, జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఇలక్కియ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆమె హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత, జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసిన ప్రత్యేక కేసుల పర్యవేక్షణ, కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలు, జల్ జీవన్ మిషన్ పనులు, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖకు సంబంధించి గర్భిణీలు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ, మూడో దశ రీ సర్వే పనుల పురోగతి, హౌసింగ్ ఇతర ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై సీఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాల పనులు వేగవంతం చేసి రెండు వారాల్లో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహనాయక్, డీఐవో కె.రత్నకుమార్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి రాధాకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని గురువారం నిర్వహించి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా తదితరులు మాట్లాడుతూ నిలువెత్తు దేశభక్తి, నిరాడంబరత, ప్రజా సేవకు నిదర్శనమైన లాల్ బహదూర్ శాస్త్రి చిరస్మరణీయుడన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర




వేళంగిలో జరుగుతున్న వాలీబాల్ మ్యాచ్

కరప: ఆడుదాం ఆంధ్ర క్రీడలలో భాగంగా మండలంలో గురువారం కరప, వేళంగి, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో క్రికెట్, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఎంపీడీఓ కె.అప్పారావు, ఎంఈఓ-2 పి.సత్యనారాయణ పర్యవేక్షణలో పీడీలు, సచివాలయం సిబ్బంది, గ్రామవలంటీర్లు, కార్యదర్శులు ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ అప్పారావు మాట్లాడుతూ మండలస్థాయి పోటీల్లో క్రికెట్‌లో 9 మ్యాచ్‌లు, వాలీబాల్ పోటీలో 10 మ్యాచ్‌లు జరిగాయన్నారు.

వేడుకగా కుంభాభిషేకం

- కనక మహాలక్ష్మి అమ్మవారికి 8 వేల మంది పూజలు



అమ్మవారికి అభిషేకం చేసేందుకు వెళ్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక ద్వారకానగర్‌లో భక్తులకు కొంగు బంగారమైన కనక మహాలక్ష్మి అమ్మవారి మహా కుంభాభిషేకం గురువారం ఎంతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకూ ఆగమశాస్త్ర పండితులచే మంత్రోచ్చారణ మధ్య నిర్వహించారు. సుమారు 8 వేల మంది భక్తులు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి అభిషేకం నిర్వహించేందుకు భక్తులు గంటలు కొద్దీ క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులు స్వయంగా అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పండ్లరసాలు, పన్నీరు, కొబ్బరినీటితో అభిషేకం చేసుకునే అవకాశం కల్పించడంతో అధిక సంఖ్యలో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం ఆగమశాస్త్ర పండితులు చక్రవర్తుల గోపాలకృష్ణమాచారి ఆధ్వర్యంలో లక్షకుంకుమ పూజ నిర్వహించారు. జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి అమ్మవారి అభిషేకం నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ఈఓ పల్లాల కృష్ణారెడ్డి స్వాగతం పలికారు. నెలలు రోజులుగా అమ్మవారికి ఎంతో వైభవంగా పూజలు నిర్వహించినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు.

ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల తనిఖీ



మల్లవరం గ్రామ పరిధిలో ఉన్న చెక్‌పోస్టు తనిఖీలలో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని చెక్ పోస్టులను విస్తృతంగా తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణాతో పాటు అసంబద్ధ కార్యకలాపాలకు ఆస్కారం ఉన్న చెక్‌పోస్టు మార్గాలలో భద్రతాపరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. మల్లవరం గ్రామ ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు, సుంకర పాలెం సెబ్ చెక్‌పోస్టు, అరిటికాయలంక వద్ద ఏర్పాటు కానున్న మరో చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. సెబ్, రవాణా శాఖ, స్టేట్ కమర్షియల్ టాక్స్ అధికారులు, పోలీస్ అధికారులతో కలసి ఆయన ఈ తనిఖీలు చేశారు.

నర్సింగ్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో బుధవారం నిర్వహిస్తున్న మొదటి సంవత్సరం నర్సింగ్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌లోని గూగుల్ సాయంతో జవాబులు రాస్తూ పట్టుబడగా, రెండో విద్యార్థి స్లిప్పులతో రాస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి పట్టుబడ్డారు. వారిద్దరినీ అక్కడికక్కడే డిబార్ చేస్తూ ఆమె ఆదేశాలిచ్చారు. స్లిప్పులను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోకుండా పరీక్ష హాల్‌లోకి అనుమతించిన సిబ్బందిని నిలదీశారు. విద్యార్థినికి సెల్‌ఫోన్ అందించిన ఇన్విజిలేటర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె నేపథ్యాన్ని ఆరా తీసి సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. నర్సులు, ట్యూటర్లను ఇన్విజిలేటర్లుగా నియమించకూడదన్న నిబంధనకు విరుద్ధంగా ఆమె ఎందుకు అక్కడ నియమించబడిందో విచారణకు ఆదేశిస్తూ చీఫ్ ఎగ్జామినర్‌ను వివరణ కోరారు. బాధ్యులైన వారిపై కలెక్టర్‌కు నివేదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదరు విద్యార్థుల నిర్వాకాన్ని డీఎంఈకి వివరించి డిబార్ తక్షణ అమలును నిర్ధారిస్తూ గురువారం డాక్టర్ లావణ్యకుమారి లేఖ రాశారు.

నేటి నుంచి సంక్రాంతి క్రికెట్ టోర్నీ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సీఏకే) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు సంక్రాంతి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు, ఆ సంఘం అధ్యక్షుడు దేవు మధువీరేష్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ పిచ్‌ను తయారు చేయించామన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కరప పరిసర గ్రామాల నుంచి 30 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయన్నారు. విజేతకు దేవు సూర్యనారాయణమూర్తి రోలింగ్ గోల్డ్‌కప్ అందజేస్తామన్నారు. దీంతోపాటు విన్నర్, రన్నర్ జట్లకు పేపకాయల వరప్రసాద్, భోగిరెడ్డి వెంకటేశ్వరరావుల జ్ఞాపకార్థం ట్రోఫీలు అందజేస్తామని మధువీరేష్ తెలిపారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కాకినాడ: స్థానిక జగన్నాథపురం, 22వ డివిజన్ పరిధిలో పారిశుధ్య పరిస్థితిపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు గురువారం తనిఖీ చేశారు. హూపర్ టిప్పర్ వాహనాలు వస్తున్నప్పటికీ మార్కెట్లో చెత్తను దుకాణాల ముందు వేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. చెత్తను డస్ట్ బిన్లలో మాత్రమే ఉంచి సిబ్బందికి అందజేయాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ విషయమై ప్రజలు వ్యాపారుల్లో మరింత అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ వై ఆర్ ఎల్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్యాలెండర్‌ను గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు ఆ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిదారుల సంఘం ఐక్యతకు చిహ్నంగా క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు కోనేటి రాజు, కొజ్జవరపు నాగేశ్వరరావు, పెదపూడి చంటి, మాణిక్యం, సత్యవాడ బాబ్జీ, శీరందాసు రాజేష్, పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం గ్రామములో వేంచేసియున్న శ్రీ మండేశ్వర - శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల దేవస్థానము నందు భక్తులు సమర్పించు కొబ్బరి కాయలో సగభాగం చెక్క 2 సంవత్సరముల కాలపరిమితికి తీసుకొని పోవు హక్కునకుగాను ది. 27-01-2024వ తేది ఉదయం గం.10.00లకు శ్రీ స్వామి వారి దేవస్థానము వద్ద శ్రీ తనిఖీదారు, దేవదాయశాఖ, కాకినాడవారి సమక్షమున టెండర్-కమ్-బహిరంగ వేలము జరుగును.

వ.నెం.	వివరము	ధరావత్తు	కాలపరిమితి
1.	భక్తులచే సమర్పించబడిన సగం కొబ్బరి చెక్క ప్రోగు చేసుకునే హక్కు	రూ.50,000/-	ది. 01-02-2024 నుండి ది. 31-01-2026 వరకు

బహిరంగ వేలం పాట షరతులు: 1) ఈ బహిరంగ వేలం దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షములో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల ఆమోదమునకు లోబడి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడును. 2) సదరు బహిరంగ వేలం దేవదాయ ధర్మదాయశాఖ చట్టం 30/87 రు ప్రకారం జి.ఓ.యం.యస్.నెం.379 రెవెన్యూ ఎండోమెంట్స్-1 డిపార్టుమెంటు ది.11-3-2003 మరియు జి.ఓ.ఎమ్.ఎస్.నెం.425, ది. 9-11-2015 ప్రకారం ననుసరించి జరుపబడుచున్నవి. 3) పాటదారులు పాటలో పాల్గొనుటకు ముందుగా ఐడెంటిటీ ప్రూఫ్ (అనగా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు) ఏదైనా చూపించి పాటలో పాల్గొనవలెను. సదరు పాట నందు హిందువులు మాత్రమే పాల్గొనవలెను. 4) పట్టికలో తెల్పిన ప్రకారం పాటలో పాల్గొను ప్రతి పాటదారుడు ప్రథమ ధరావత్తు ముందుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాట ఆఖరున హెచ్చు పాటదారుని ప్రథమ ధరావత్తు తప్ప మిగిలిన వారి ప్రథమ ధరావత్తులు వాపస్ చేయబడును. 5) పాట కొట్టివేసిన వెంటనే హెచ్చు పాటదారుడు హెచ్చు పాట పాడిన మొత్తం రూపాయలు వెంటనే చెల్లించు నిర్ణయం. 6) మిగిలిన పాట షరతులు ఆఫీసు పనిచేయు కాలములో అడిగి తెలుసుకొనవచ్చును.

ఇంద్రపాలెం గ్రామం,
ది.11-01-2024.

జోగా సత్యనారాయణ
కార్యనిర్వాహణాధికారి గ్రేడ్-II